
సాక్షి ప్రకాశం

శనివారం । 3 । జూన్ । 2023



పృథులగిరి ఘాట్ నిర్మాణానికి రూ.5 కోట్లు

పృథులగిరి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

- 8లో..



చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారైన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసు, బైక్ రికవరీ చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

41 /30

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికం. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

14 మంది తహశీల్దార్లకు స్థాన చలనం

- డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్‌లు కూడా..



ఒంగోలు అర్బన్: జిల్లాలో సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ శాఖలో 14 మంది తహశీల్దార్లను బదిలీ చేశారు. వీరితో పాటు డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన తహశీల్దార్లలో కలెక్టరేట్ ఏఓగా ఉన్న సీహెచ్ శ్రీనివాసరావును మార్కాపురం సబ్ కలెక్టర్ ఆఫీసులో కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దార్‌గా నియమించారు. కలెక్టరేట్ ల్యాండ్–1 సూపరింటెండెంట్‌గా ఉన్న కే చిరంజీవిని కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా, ల్యాండ్–2 సూపరింటెండెంట్‌గా ఉన్న కేవీ ప్రసాద్‌ను సంతనూతలపాడు తహశీల్దార్‌గా, కంభం తహశీల్దార్‌గా ఉన్న టీ రవిని కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్‌గా, దర్శి తహశీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్‌ను కంభం తహశీల్దార్‌గా, మార్కాపురం తహశీల్దార్‌గా సెలవుపై ఉన్న ఎస్ వెంకటేశ్వర్లును కలెక్టరేట్ ల్యాండ్–2 సూపరింటెండెంట్‌గా, ఎస్ఎన్ పాడు తహశీల్దార్ ఎస్ శ్రీనివాసరావును ఎన్‌జీ పాడు తహశీల్దార్‌గా, పొదిలి తహశీల్దార్ డీ భాగ్యలక్ష్మిని మార్కాపురం తహశీల్దార్‌గా, మార్కాపురం కేఆర్‌సీసీ తహశీల్దారుగా ఉన్న వై స్వప్నప్రియను కందుకూరు కేఆర్‌సీసీ తహశీల్దారుగా, పామూరు తహశీల్దార్ జ్వాలా నరసింహంను కురుచేడు తహశీల్దార్‌గా, కురిచేడు తహశీల్దార్ ఎస్‌కే నాగుల్‌మీరాను వెలిగండ్ల తహశీల్దార్‌గా, వెలిగండ్ల తహశీల్దార్‌ను పామూరు తహశీల్దార్ గా, సీఎస్‌పురం (ఎఫ్ఏసీ)గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరితో పాటు 32 మంది డిప్యూటీ తహశీల్దార్‌లను, 15 మంది సీనియర్ అసిస్టెంట్‌లు, ఆర్ఐలను, 17 మంది జూనియర్ అసిస్టెంట్‌లు, టైపిస్ట్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గృహయజ్ఞం.. సిద్ధించేలా !



ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు

- పేదలకు స్థలాలు దక్కకుండా టీడీపీ కుట్రలు

అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలి.. అది కూడా ఒకే చోట ఇచ్చి ఒక పట్టణాన్ని నిర్మించాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తలంచారు. అయితే దీనికి తెలుగుదేశం పార్టీ న్యాయపరమై చిక్కులు కల్పించి మోకాలడ్డింది. టీడీపీ కుయుక్తులకు బాలినేని పైఎత్తులు వేశారు. ఎలాగైనా పేదలకు గూడు కల్పించాలన్న లక్ష్యంతో అడుగులు వేశారు. నగరం చుట్టూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములను సేకరించి 24 వేల మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంచారు. ఇది ప్రభుత్వంపై భారమైనా సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి.

- టీడీపీ కుయుక్తులను చిత్తు చేసేలా ప్రణాళిక
- నగరం చుట్టూ ఇళ్లు నిర్మించేలా రంగం సిద్ధం
- అంగీకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఇప్పటికే రూ.200 కోట్లు కేటాయింపు
- 508 ఎకరాలు రైతుల వద్ద నుంచి కొనుగోలు
- త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నగరంలోని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి భావించారు. నగర పరిసరాలతో పాటు ఒంగోలు మండల పరిధిలో 508 ఎకరాలు సేకరించి ఇళ్లు కట్టించాలని తలంచారు. రైతుల వద్ద నుంచి ప్రైవేటు భూములను కొనుగోలు చేసి ఇవ్వటానికి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంగీకారం తెలిపారు. భూములు కొనుగోలు చేసేందుకు రూ.200 కోట్లు కేటాయించారు కూడా. ఇప్పటికే రైతుల వద్ద కొనుగోలు చేసిన భూముల కోసం రూ.30 కోట్లు విడుదల చేశారు.

నాలుగు గ్రామాల పరిధిలో...

ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు నాలుగు గ్రామాలను గుర్తించారు. మొత్తం దాదాపు 25 వేల మందికి ఇచ్చేలా స్థలాల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెంను ఆనుకొని యరజర్ల రెవెన్యూకు చెందిన కొంత భూమిని కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ నాలుగు గ్రామాల పరిధిలోని 453 ఎకరాలను కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మంజూరు చేశారు. స్థలాలు గుర్తించిన అధికారులు సర్వే నంబర్ల సబ్ డివిజన్ ప్రక్రియలు ప్రారంభించారు. సర్వే నంబర్ల వారీగా అనుభవదారులు, హక్కుదారులను గుర్తించి వారి వద్ద నుంచి కొనుగోలు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. అది కూడా పూర్తి కావస్తోంది. మిగతా 55 ఎకరాలను కూడా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేందుకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్ అంగీకారం...

నిరుపేదలకు 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిద్దామన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి నిర్ణయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అంగీకరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎంత ఖర్చయినా వెనకాడకుండా ఆ ఏర్పాట్లు చేసుకోవాలని బాలినేనికి ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దీంతో భూముల పరిశీలన, భూముల కొనుగోలు నిధులు కేటాయింపు అన్నీ చకా..చకా జరిగిపోయాయి. భూముల కొనుగోలుకు రూ.200 కోట్లతో పాటు కొనుగోలు చేసిన భూముల్లో ప్లాట్లుగా వేయటానికి చదును చేయటం, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, విద్యుదీకరణ, మంచినీటి సౌకర్యం కల్పించటం లాంటి మౌలిక వసతుల కోసం మరో రూ.85 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరుతాం



టీడీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి తీరుతాం. టీడీపీ నాయకులు ఎన్ని అవాంతరాలు కల్పించినా నిరుపేదలకు ఇళ్లు నిర్మించడం మాత్రం ఆపేది లేదు. సీఎం వైఎస్ జగన్‌కు ఇళ్ల పట్టాల విషయం చెప్పాను. కోర్టు అడ్డంకులు ఉన్నందున ప్రైవేటు స్థలాలు అయినా కొనుగోలు చేసి ఇద్దామని హామీ ఇచ్చారు. దీంతో ఒంగోలు నగరం చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల పరిధిలో దాదాపు 508 ఎకరాలు కొనుగోలు చేసి ఇవ్వటానికి భూములు గుర్తించి కొనుగోలు ప్రారంభించాం. అందు కోసం రూ.200 కోట్లు కేటాయించాం. దాదాపు 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు వేగవంతం చేశాం.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

పేదల ఇళ్ల కోసం బాలినేని తపన...

టీడీపీ నేతలు పేదలకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుపడటంతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న వారికి నిలువ నీడ కల్పించాలని ఐదో సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాడే తలంచారు. అప్పటి నుంచి నగరంలో ఉన్న దాదాపు 25 వేల మందిని గుర్తించి వారికి గూడు కల్పించాలని నిర్ణయించారు. వెంటనే ప్రభుత్వ స్థలం ఒకేచోట ఎక్కడ ఉందో పరిశీలించాలని రెవెన్యూ అధికారులను పురమాయించారు. యరజర్ల వద్ద ఒకేచోట 818 ఎకరాల స్థలాన్ని అధికారులు ఎంపిక చేశారు. భూమిని చదును చేసి ప్లాట్లు కూడా వేశారు. అక్కడే శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మించాలని యోచించి ఒంగోలును మహానగరం చేయాలనుకున్నారు. ఇది టీడీపీ నేతలకు కంటగింపుగా మారింది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన అనుచరుల చేత హైకోర్టులో కేసు వేయించి అక్కడ ప్లాట్లు ఇవ్వనీయకుండా అడ్డుకున్నారు. ఒకేచోట అంత పెద్ద శాటిలైట్ టౌన్ షిప్ నిర్మాణం జరిగితే తనకు జనాల్లో పుట్టగతులు ఉండవని భావించి, పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వనీయకుండా సైంధవునిలా అడ్డుపడ్డాడు. ఒక వైపు న్యాయపోరాటం చేస్తూనే పేదలకు ఇళ్లు కట్టించాలన్న ఆలోచనకు బాలినేని పదును పెట్టారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోయినా ప్రైవేటు స్థలం అయినా కొనుగోలు చేసి ఇవ్వాల్సిందేనని గట్టి నిర్ణయానికి వచ్చారు.



యరజర్ల వద్ద వేసిన శాటిలైట్ టౌన్‌షిప్ లేఔట్ (ఫైల్)

23 మంది ఎంపీడీవోలు బదిలీ

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా 23 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 15 మంది ప్రకాశం జిల్లాలో బదిలీకాగా మరో 8 మంది బాపట్ల జిల్లాలో బదిలీ అయ్యారు. వీరిలో పలువురు బదిలీ కాగా మరికొంతమంది పదోన్నతి పొందిన వారు ఉన్నారు.

ప్రకాశం జిల్లాలో 15 మంది

మండలం	ఎంపీడీవో పేరు	బదిలీ/పదోన్నతి
పామూరు	బి.సురేష్	త్రిపురాంతకం
చీమకుర్తి	కె.రాఘవేంద్ర	సంతనూతలపాడు
త్రిపురాంతకం	ఎం.సాంబశివరావు	సంతమాగులూరు
కనిగిరి	జేబీవీ మల్లిఖార్జునరావు	పీసీపల్లి
కొండపి	ఎంవీ రమణమూర్తి	జె.పంగులూరు
కొమరోలు	డి.నరసయ్య	కంభం
అర్ధవీడు	ఎస్.జగదీష్	నెల్లూరు జెడ్పీ ఏఓ
గిద్దలూరు	వి.హేమలతాదేవి	పల్నాడు ఈవోఆర్‌డీ
పెదచెర్లోపల్లి	కె.శ్రీనివాసరెడ్డి	నెల్లూరు ఈవోఆర్‌డీ
పొన్నలూరు	బి.కల్పన	నెల్లూరు ఈవోఆర్‌డీ
కొనకనమిట్ల	ఎ.శ్రీనివాసమూర్తి	ప్రకాశం జెడ్పీ ఏవో
నాగులుప్పలపాడు	డి.జయమణి	ప్రకాశం జెడ్పీ ఏవో
దోర్నాల	ఎస్.విజయ	జెడ్పీ ఏవో చిత్తూరు
పుల్లలచెరువు	ఎం.నాగిరెడ్డి	ఈవోఆర్‌డీ కృష్ణా
వై.పాలెం	వైవీ.నాగేశ్వరప్రసాద్	నెల్లూరు జెడ్పీ ఏవో

బాపట్ల జిల్లాలో 8 మంది

మండలం	ఎంపీడీవో పేరు	బదిలీ/పదోన్నతి
సంతమాగులూరు	జి.లక్ష్మీదేవి	పర్చూరు
పర్చూరు	వి.ప్రద్యుమ్నకుమార్	కొనకనమిట్ల
బల్లికురవ	సీహెచ్ కృష్ణ	ఇంకొల్లు
కారంచేడు	డి.విజయలక్ష్మి	చినగంజాం
జె.పంగులూరు	బి.రామాంజనేయులు	జెడ్పీ ప్రకాశం ఏవో
అద్దంకి	ఆర్.దేవసేన కుమారి	జెడ్పీ ప్రకాశం ఏవో
చినగంజాం	కె.స్వరూపారాణి	ప్రకాశం ఈవోఆర్‌డీ
ఇంకొల్లు	రాజ్యలక్ష్మి	జెడ్పీ ప్రకాశం ఏవో

బీసీ సంక్షేమ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ

టంగుటూరు: జిల్లాలోని కొండపి (బాలురు), మార్కాపురం (బాలికలు), కనిగిరి (బాలికలు), దరిమడుగు (బాలురు)ల్లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకులాల కన్వీనర్ కె.రాజారావు టంగుటూరులో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు మీడియంలో 6, 7, 8, 9 తరగతుల్లో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న సీట్లను నింపేందుకు జూన్ 3 నుంచి 9 వరకు విద్యార్థులు రెండు కలర్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకొచ్చి దరఖాస్తులు అందించాలన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం చదువుతూ ఉండాలని, వారి కుటుంబ వార్షిక ఆదాయం ఆదాయం ఒక రూ.లక్షకు మించరాదని చెప్పారు. విద్యార్థులను జూన్ 12వ తేదీ జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసి, ప్రస్తుత 2023–24 విద్యా సంవత్సరానికి అర్హత సాధించిన తరగతిలో మాత్రమే చేరుస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 9వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించి, 12న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలన్నారు. వివరాలకు టంగుటూరు (బాలురు) సెల్: 9515121249, మార్కాపురం (బాలికలి) సెల్: 9515411954, దరిమడుగు (బాలురు) సెల్: 7286969849, కనిగిరి (బాలికలు) సెల్: 9441130614 నంబర్లను సంప్రదించాలన్నారు.

పసుపు మద్దతు ధర క్వింటాకు రూ.6,850

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతు పంటలకు మద్దతు ధర కల్పించేందుకు పసుపు క్వింటాకు రూ.6,850 లెక్కన ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేసిందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్‌లో నమోదైన రైతులు వారికి సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో సంబంధిత వీఏఏ, వీహెచ్ఏల ద్వారా సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 4వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. నమోదు చేసుకున్న రైతుల సరుకు కొనుగోలుకు జూన్ 12వ తేదీ వరకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పసుపు రైతులు తమ పేర్లు నమోదు చేసుకునే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్టర్ మొబైల్‌కు మెసేజ్ వస్తుందని చెప్పారు. అంతేకాకుండా బ్యాంక్ అకౌంట్‌కు ఫోన్ నంబర్ లింక్ అయిందో లేదో సరిచూసుకోవాలన్నారు. రైతులు పంటను శుభ్ర పరుచుకుని, ఆరబెట్టుకుని ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకంలో గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకమైన పాలన క్షేత్రస్థాయిలోనే అందిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. త్రిపురాంతకం చెరువుకు పైప్‌లైన్ ద్వారా సాగర్ జలాలు అందించడం, శిథిలమైన గెస్ట్ హౌస్ స్థానంలో నూతన అతిథి గృహ నిర్మాణం, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, షాదీఖానా స్థలానికి 20 సెంట్ల కేటాయింపు వంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ త్వరలో స్థలాలు అందిస్తామని సురేష్ హామీ ఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో వచ్చిన సమస్యలపై సిబ్బంది స్పందించి పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని సురేష్ కోరారు. త్రిపురాంతకంతో పాటు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి మంత్రి సురేష్ తీసుకెళ్లారు. షాదీఖానా పై తగిన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. మిగిలిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళుతున్న మంత్రి సురేష్ ...కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ సేతు మాధవన్ లను శాలువలు, పూలమాలలతో సత్కరించారు. వీరి వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్ సుశీల వెంకట పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, దేవాలయాల ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ పద్మజ మల్లికార్జున్, పార్టీ నాయకులు నక్క చిన్నత్రిపురారెడ్డి, రంగబాబు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణరెడ్డి, లింగయ్య, బాలకోటిరెడ్డి ఉన్నారు.



త్రిపురాంతకంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్‌కలెక్టర్ సేతు మాధవన్



త్రిపురాంతకం గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

'పర్యావరణ హిత నడక' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో జూన్ 5వ తేదీ వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ హిత నడక కరపత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న గ్రీన్ వాక్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఆర్గనైజేషన్ చైర్మన్ వీరభద్రాచారి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం రోజు సీవీఎస్ రీడింగ్ రూము నుంచి కలెక్టరేట్ వరకు గ్రీన్‌వాక్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ట్రైనీ ఐఏఎస్ పాల్గొన్నారు.

కోటప్పకొండ ఇన్చార్జ్ ఈఓగా శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: పల్నాడు జిల్లా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఇన్చార్జ్ కార్యనిర్వహణాధికారిగా మార్కాపురం లక్ష్మీచెన్నకేశవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కోటప్పకొండ ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, త్వరలో బాధ్యతలు స్వీకరిస్తానని శ్రీనివాసరెడ్డి చెప్పారు.

క్లుప్తంగా

శేష వాహనంపై నరసింహస్వామి



సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నరసింహస్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మెట్ల పూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. శనివారం ఉదయం చప్పరోసేవ, సాయంత్రం హనుమంతుని వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు.

నేడు ఎడ్ల పందేలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు తొలి మూడు బహుమతులు వరుసగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు అందజేస్తామని వివరించారు.

5, 6వ తేదీల్లో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో భూలక్ష్మీ సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 5, 6వ తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న రెండు పళ్ల విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాలుగో, ఐదో బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8, రూ.5 వేలు, అలాగే 6న న్యూ కేటగిరీ విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఐదు బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు 9849490257, 9133262194, 9959815290ను సంప్రదించాలని కోరారు.

7న పూసలపాడులో..

పూసలపాడులో అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7న ఆరు పళ్ల విభాగంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి నాలుగు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 91822 25180, 70138 64288, 63019 46022ను సంప్రదించాలని సూచించారు.

పొగాకు అత్యధిక ధర రూ.203

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కేజీ గరిష్ట ధర రికార్డు స్థాయిలో రూ.203గా నమోదైంది. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 1006 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు 971 కొనుగోలు చేశారు. 38 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి రూ. 199.84 పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్

యర్రగొండపాలెం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు పడిందని ఏపీఓ ఎం.శైలజ శుక్రవారం తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా యర్రగొండపాలెం, మిల్లంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్లు తూమాటి వెంకటేశ్వర్లు, సంద్రపాటి బాబు సస్పెండ్ అయ్యారని, వీరభద్రాపురానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆతుకూరి రమణారెడ్డి కూలీలకు ఉపాధి కల్పించకపోవడం, డబ్బు వసూలు చేశాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు వివరించారు.

పెళ్లయిన 18 రోజులకే..

- ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

కొత్తపట్నం: వివాహిత యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపట్నం గ్రామానికి చెందిన వెన్నపూసల వైష్ణవి (19) లింగసముద్రం మండలం అదే గ్రామానికి చెందిన వెన్నపూసల భాస్కర్‌రెడ్డికి ఇచ్చి 18 రోజుల క్రితం వివాహం చేశారు. 16 రోజుల పండుగకు అల్లుడు భాస్కర్‌రెడ్డి కొత్తపట్నంలో అత్తగారింటికి వచ్చాడు. 16 రోజుల పండుగ కూడా బాగా చేసుకొన్నారు. అయితే ఏమైందో తెలియదు గానీ శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి చున్నీతో ఉరివేసుకొంది. కొద్దిసేపటికి బంధువులు చూడటంతో దూలానికి వేలాడుతూ కనిపించింది. అక్కడే ఉన్న బంధువులు ఆమెను హుటాహుటిన ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు కట్టుకోండి



త్రిపురాంతకం జగనన్న హౌసింగ్ కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



త్రిపురాంతకం జగనన్న విద్యాకిట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

- గృహ లబ్ధిదారులకు కలెక్టర్ దినేష్ కుమార్ సూచన
- త్రిపురాంతకం మండలంలో విస్తృత పర్యటన

త్రిపురాంతకం: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులు సహకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం త్రిపురాంతకం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన నిర్వహించారు. త్రిపురాంతకంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై ఆయన అధికారులు, లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని చెప్పారు. అధికారులు లబ్ధిదారులకు సహకారం అందించి నిర్మాణ పనులు పూర్తి చేయించాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఎస్టీ కోయ కుటుంబాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్.సుశీల వెంకట పిచ్చయ్య, ఎస్టీ యానాదులకు ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి సహకారం అందించి పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని కలెక్టర్‌కు తెలియజేశారు. ప్రత్యేకాధికారి చెన్నయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈ వెంకటస్వామి, డీఈ సురేష్‌బాబు, శ్రీనివాసులుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్య పటేల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు తనిఖీ

మండలంలోని రాజుపాలెంలో నాడు–నేడు కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులను కలెక్టర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి తరగతి గదిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన పనులు జరుగుతున్న తీరుపై అధికారులను ప్రశ్నించారు. నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పాఠశాలలు తిరిగి ప్రారంభించేలోపే నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఎంఈఓ తులసిమల్లికార్జున నాయక్, ఏఈ మహేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఎంపీటీసీ చల్లా జ్యోతి, సర్పంచ్ బి.కృపారాణి, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ యల్లారెడ్డి ఉన్నారు. త్రిపురాంతకం జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతను కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. అలాగే బాలా త్రిపురసుందరీదేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో కలెక్టర్ పూజలు నిర్వహించారు.

సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తా

- ఎస్పీ మలికా గర్గ్



పోలీసు సిబ్బంది నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మీ సమస్యలేమిటో చెప్పండి.. సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తా అంటూ పోలీసు సిబ్బందికి ఎస్పీ మలికా గర్గ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సంక్షేమ దివస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోలీసులు, హోంగార్డుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. శాఖాపరంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసు సిబ్బంది, హోంగార్డులు ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి నుంచి వినతి పత్రాలు తీసుకున్న ఎస్పీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సమస్యలను పరిష్కరించడం ద్వారా వారు మరింత క్రియాశీలకంగా ప్రజలకు సేవలు అందజేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఒ.దుర్గా ప్రసాద్, ఎస్సై భవాని తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

- నిందితులు పాత నేరస్తులు.. బంగారు గొలుసు, బైక్ రికవరీ
- ఆధార్‌లో ఇంటి పేరు మార్చేసిన వైనం
- కనిగిరి సీఐ, కనిగిరి, హెచ్‌ఎంపాడు, పీసీపల్లి ఎస్సైలను అభినందించిన డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ రత్నాకర రామరాజు, పక్కన సీఐ, ఎస్సైలు

కనిగిరి రూరల్: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కుని పరారైన కేసులో ముగ్గురిని పోలీసులు శుక్రవారం పట్టుకుని, వారి నుంచి బంగారు గొలుసు, బైక్ రికవరీ చేశారు. ఈ మేరకు డీఎస్పీ రత్నాకర రామరాజు స్థానిక కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. హెచ్‌ఎంపాడు మండలం వీరారెడ్డిపల్లికి చెందిన ఉడుముల ఆదిలక్ష్మమ్మ 70 ఏళ్ల వృద్ధురాలు. గత నెల 25న ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా.. దొంగలు ఆమె మెడలోని సుమారు 18 గ్రాముల బంగారు గొలుసును లాకుని పరారయ్యారు. బాధితురాలు గత నెల 27న హెచ్‌ఎంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో కనిగిరి సీఐ శివరామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కనిగిరి, హెచ్‌ఎంపాడు, పీసీపల్లి ఎస్సైలు దాసరి ప్రసాద్, కృష్ణపావని, నాగేశ్వరావు, పోలీసు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సాంకేతిక పరిజ్ఞానంతో వేములపాడు గ్రామంలోని గుడిపాటిపల్లి గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డు ప్రాంతంలో పొదిలి మండలానికి చెందిన పొన్నరసు అంజయ్య అలియాస్ చిన్న పోలా, పొన్నరసు పోలా నరేష్, పొన్నరసు యేసుదాసు అలియాస్ యేసు పోలాను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 18 గ్రాముల చైన్, చోరీకి ఉపయోగించిన బైక్(హోండా షైన్), రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నిందుతులపై గతంలోనే కేసులు

గొలుసు దొంగతనం కేసులో పట్టుబడిన ముగ్గురు నిందితులు బంధువులు. వీరు పలు నేరాలకు పాల్పడినట్లు రికార్డులున్నాయి. ఏ1, ఏ3లపై పొదిలి స్టేషన్‌లో కూడా పలు కేసులు నమోదై ఉన్నాయి. వీరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోరీలను పాల్పడినట్లు సమాచారం. నిందితులు తెలివిగా ఆధార్ కార్డుల్లో ఇంటి పేర్లు మార్చి పలు ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి వీళ్ల ఇంటి పేర్లు పోలా(పాముల కులం) కాగా పొన్నర్సు(ఎరుకుల కులం)గా ఆధార్‌లో నమోదు చేసుకుని తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే అవకాశం ఉన్నచోటల్లా నేరాలకు తెగబడుతున్నారని డీఎస్పీ తెలిపారు.

సత్తాచాటిన పల్నాడు గిత్తలు

రాచర్ల: మండలంలోని యడవల్లి పంచాయతీ పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయ స్థిర ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆరు పళ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయి యాదవ్ ఎడ్లు సత్తా చాటాయి. పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొనగా చిన్నబ్బాయి యాదవ్ గిత్తలు నిర్ణీత 20 నిమిషాల్లో 3163 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.40 వేలు, కంభం మండలం యర్రబాలేనికి చెందిన హేమలతనాయుడు ఎడ్లు 3,005 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.30 వేలు, నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ 2,787 అడుగులు లాగి మూడో బహుమతి రూ.25 వేలు, పల్నాడు జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన శివకృష్ణచౌదరి ఎడ్లు 2,750 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.15 వేలు, నంద్యాల మండలం కాంతినగరం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు 2,505 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.10 వేలు, నర్సరావుపేట మండలం దొండపాడు గ్రామానికి చెందిన రాజశేఖర్ ఎడ్ల జత 2,343 అడుగులు ఆరవ బహుమతి రూ.5 వేలు సాధించాయి. ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా ఎడ్ల యజమానులకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమ బహుమతిని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అందజేశారు.



గుడిమెట్టలో బండ లాగుతున్న ఎడ్లు

గుడిమెట్టలో విజేతగా జేసీ అగ్రహారం ఎడ్లు

గుడిమెట్ట గ్రామంలో హజరత్ మౌలాలీ స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎడ్లు 862 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన దప్పిలి అంజిరెడ్డి ఎడ్లు 737 అడుగులు లాగి రెండో స్థానంలో, వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం నర్సపురం గ్రామానికి చెందిన కామిని వెంకట సాయి ప్రతాప్‌రెడ్డి ఎడ్లు 603 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.50 వేలను హజరత్ మౌలాలి స్వామి దేవస్థానం, రెండో బహుమతి రూ.40 వేలను బెల్లం నాగిరెడ్డి, కామిరెడ్డి భూపాల్ రెడ్డి, మూడో బహుమతి రూ.20 వేలను నక్కా రామకృష్ణయ్య కుమారులు అందజేశారు.

కారు, ట్రాక్టరు ఢీ

- ఒకరు మృతి, 8 మందికి గాయాలు




ప్రమాదంలో మృతి చెందిన అశోక్‌వర్ధన్‌లాల్

పొదిలి రూరల్: పొదిలి మండలం మాదాలవారిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి బొలెరో వాహనం, ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో 8 మందికి గాయాలయ్యాయి. తొమ్మిది మంది భక్తులు శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకుని కారులో చెన్నై వెళ్తూ.. పొగాకు బేళ్లను తరలిస్తున్న ట్రాక్టరును ఢీకొట్టారు. కారులో ఉన్న అశోక్‌వర్ధన్‌లాల్ అనే వ్యక్తి మృతి చెందగా, మరో 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పృథులగిరి ఘాట్

నిర్మాణానికి రూ.5 కోట్లు





CHIEF MINISTER'S OFFICE

Government of Andhra Pradesh

ఘాట్‌రోడ్ నిర్మాణానికి అనుమతి మంజూరు పత్రం

- సీఎం పేషీ నుంచి అనుమతులు మంజూరు
- ఫలించిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి, ఎంపీపీ వాకా ప్రయత్నం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేస్తూ సీఎం పేషీ నుంచి మంగళవారం పరిపాలన అనుమతులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ సమన్వయకర్త, మద్దిపాడు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేసిన ప్రయత్నం ఫలించింది. భక్తుల ఇలవేల్పుగా మారిన 15వ శతాబ్దం నాటి ఈ పురాతన ఆలయంలో ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లిస్తుంటారు. ఈ ఆలయానికి 140 ఎకరాల భూమి ఉంది. అయితే పృథులగిరిపైకి చేరుకోవాలంటే భక్తులకు మెట్లమార్గమే దిక్కు. గత బ్రహ్మోత్సవాల సమయంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భక్తులు దారి ఏర్పాటు చేసుకున్నారు. ఈ రహదారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అటవీ శాఖాధికారులు 6 మీటర్ల వెడల్పు, రెండున్నర కిలోమీటర్లు పొడవున ఘాట్ రోడ్ గుండా కొండపైకి వెళ్లేందుకు అనుమతులు ఇచ్చారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్దకు భక్తులు చేరుకునేందుకు తారు రోడ్ నిర్మించాలని, అందుకు రూ.5 కోట్లు అవసరమవుతాయంటూ వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దిపాడు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 12న మార్కాపురం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు ఘాట్‌రోడ్ నిర్మాణానికి సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎంఓ నుంచి ఒంగోలు పీఆర్ ఎస్‌ఈకి ఉత్తర్వులు అందాయి. దీనిపై ఆయన సర్వే చేసి అంచనాలు ఇవ్వాలని ఒంగోలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఘాట్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేసిన వరికూటి అశోక్‌బాబు, ఎంపీపీ వాకా వెంకటరెడ్డిని మండల ప్రజలతోపాటు భక్తులు అభినందించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే స్వామివారి దర్శనానికి భక్తుల రద్దీ పెరగడమే కాకుండా, పృథులగిరి ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరికూటి, వాకా కృషితో గుండ్లసముద్రం, మద్దిపాడు చెరువులకు సాగర్ జలాలు అందించే పనులకు అనుమతి మంజూరు కాగా సంబంధిత అధికారులు సర్వే నిర్వహించిన విషయం విదితమే. తాజాగా ఘాట్‌రోడ్‌కు అనుమతులు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న వరికూటి, ఎంపీపీ వాకా